క్లుప్తంగా

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీను

ఆమనగల్లు: ఓటర్ల జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ శ్రీను అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం తహసీల్దార్ ముంతాజ్ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు పక్కాగా ఉండాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షకులు బీఎల్‌ఓలకు వివిధ అంశాలపై శిక్షణ నిర్వహించారు.

పచ్చదనం- పరిశుభ్రత తప్పనిసరి



వనమహోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

మంచాల: పచ్చదనంతో పాటు పరిశుభ్రత చాలా అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం తిరుపతయ్య అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనంతో పాటు ప్రకృతి వైపరీత్యాలను అరికట్టవచ్చన్నారు. చెట్లు నరకడంతో వాతావరణం కాలుష్యం అవుతుందని, తద్వారా అనేక అనార్థాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురవాలంటే వాతావరణాన్ని కాపాడుకోవాలి. అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

యాచారం: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై అధికారులు దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. సోమవారం తహసీల్దార్ అయ్యప్పను కలిసి భూభారతి చట్టం గురించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో విరాసత్, మ్యుటేషన్‌లకు పెట్టుకున్న అర్జీలకు ఎలాంటి చార్జీలు వేయకుండా.. సమస్యను పరిష్కరించాలని కోరారు. టీజీఐఐసీ పేరిట మార్చేసిన పట్టా భూములను, మళ్లీ రైతుల పేరిట మార్చాలని డిమాండ్ చేశారు.

బాధితుడికి పరామర్శ

మాడ్గుల: పాము కాటుకు గురై నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోల్కులపల్లి గ్రామానికి చెందిన బుర్రి రాములును సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పరామర్శించారు. అనంతరం బాధితుడికి ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రజాపాలనతో అన్నివర్గాలకు న్యాయం

ఇబ్రహీంపట్నం: ప్రజాపాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువస్తుండటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణిలో ఐదు అర్జీలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాస్ గౌడ్

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఇబ్రహీంపట్నం డివిజన్ స్థాయి ప్రజావాణిలో 5 అర్జీలు అందాయి. కోర్టుకు వెళ్లాల్సి ఉండటంతో ఆర్డీఓ అనంతరెడ్డి కొద్దిసేపు ప్రజావాణికి హాజరై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలపై రెండు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ముగ్గురు మొదటి దఫా బిల్లు ఇంటి నిర్మాణానికి ముందే చెల్లించాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఆ దరఖాస్తులను ఆయా శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని డీటీ తెలిపారు.

‘మహాలక్ష్మి’తో కళకళ

- ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట
- పెరిగిన బస్సుల రాకపోకలు
- సౌకర్యాల కల్పనకు అధికారుల కృషి
- సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు



యాచారం ఆర్టీసీ బస్టాండ్

యాచారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పుణ్యమాని యాచారం ఆర్టీసీ బస్టాండ్‌కు కళవచ్చింది. గతంలో బోసి పోయిన ప్రయాణ ప్రాంగణం.. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ, పెరిగిన బస్సుల సంఖ్యతో కళకళలాడుతోంది. గతంలో ఈ బస్టాండ్‌లోకి బస్సులు ఎక్కువగా రాకపోయేది. ప్రయాణికులు కూడా వచ్చేవారు కాదు. అత్యధిక ప్రజలు ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లేవారు. ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి మహిళలు, వారి కుటుంబీకులు సైతం ఆసక్తి చూపుతున్నారు. దీంతో సంస్థ అధికారులు.. ప్రతి బస్సును ఈ బస్టాండులో నిలిపేలా చర్యలు తీసుకున్నారు.

నిత్యం రద్దీగా..

యాచారం బస్టాండ్‌లోకి ఇబ్రహీంపట్నం డిపోతో పాటు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి తదితర డిపోలకు చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. సాగర్‌రోడ్డుపై పరుగులు తీసే బస్సులను బస్టాండ్‌లోకి వచ్చిపోయేలా చేశారు. ప్రయాణికుల సంఖ్యతో పాటు బస్సులు పెరగడంతో బస్టాండు నిత్యం రద్దీగా ఉంటోంది.

దుమ్ముధూళితో ఇబ్బంది

బస్టాండ్‌కు ప్రయాణికులతో పాటు వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. కానీ బస్టాండ్‌లోకి వచ్చిపోయే మార్గాలు అధ్వానంగా ఉండటంతో ప్రయాణ ప్రాంగణం, ఆవరణ దుమ్ముధూళితో నిండిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే అంతా బురదమయంగానే ఉంటుంది. నెల రోజుల క్రితం ఆవరణలో కంకరపోసి చదును చేసినప్పటికీ.. పూర్తి స్థాయిలో భద్రత లేకుండా పోయింది. దీంతో వారం క్రితం బస్టాండ్‌ను సందర్శించిన సంస్థ ఉన్నతాధికారులు.. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆవరణ మొత్తం సీసీరోడ్డు నిర్మిస్తేనే సమస్య తీరుతుందని భావించారు. అందుకు కావాల్సిన నిధుల మంజూరు చేయాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేశారు.

సీసీరోడ్డుకు రూ.50 లక్షలు



మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగా యాచారం బస్టాండులో అన్ని బస్సులు ఆగేలా చేశాం. బస్టాండు ప్రాంగణం, వచ్చి పోయే మార్గాలు అధ్వానంగా ఉన్నాయి. సీసీరోడ్డు నిర్మాణానికి సంస్థ యాజమాన్యానికి ప్రపోజల్స్ పంపాం. రూ.50 లక్షలకు పైగానే ఖర్చు అవుతుందని అంచనా వేశాం. రోడ్డు నిర్మాణంతో పాటు.. బస్టాండ్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తాం.

– వెంకటనర్సప్ప, మేనేజర్, ఆర్టీసీ డిపో, ఇబ్రహీంపట్నం

కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామ కార్యదర్శి అనితపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి, విధుల్లోకి తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో ఆమె ఎలాంటి నిర్లక్ష్యం చేయలేదన్నారు. తామంతా చందాలు వేసుకొని ట్రాక్టర్ నిర్వహణకు పంచాయతీలో అందజేశామని తెలిపారు. దీనితో కార్యదర్శికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేసి, విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రాజు, కృష్ణయ్య, జంగయ్య, శరత్‌చంద్ర శర్మ, కొండల్, కృష్ణయ్య, మల్లేశ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



డీపీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధి గునుగల్ గ్రామంలో సర్వే నంబరు 602లోని శ్రీ లక్ష్మీనగర్ కాలనీ వెంచర్‌లో పంచాయతీ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఇబ్రహీంపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కబ్జాకు యత్నిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకొని, స్థలాన్ని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భీమ్ యాదవ్, నర్సింహ, శాంత, ఆంజనేయులు, రమేష్, బాషా, జంగయ్య, శ్రీనువాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వం

- మిడ్డేమీల్స్ బిల్లుల చెల్లింపులో తీవ్రజాప్యం
- సీఐటీయూ నాయకులు, కార్మికులు



ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా కార్మికులకు బిల్లులు రావడం లేదని పేర్కొన్నారు. భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా పట్టించుకోవడం ఆరోపించారు. అదే విధంగా సర్కారు బడుల్లో వంట గదులు నిర్మించాలని, సిలిండర్ అందిజేయాలన్నారు. కార్మికులకు రూ.10 వేలు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాళ్లు రమాదేవి, ప్రేమలత, కమలమ్మ, భాగ్యమ్మ, మంజుల, పద్మ, నాగమణి, మమత, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ నేపథ్యంలో సోమవారం ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ కూడలి వద్ద అధికార పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరికీ రేషన్‌కార్డు ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ఫరీద్, బాల్‌రాం, వస్పుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో ఈ నెల 15న ఈజీఎస్ పథకం నాలుగవ విడత సామాజిక తనిఖీపై మండల ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 6 నుంచి 14 వరకు తనిఖీలు చేయనుందని పేర్కొన్నారు. తనిఖీ వివరాలను మండల ప్రజావేదికలో తెలియజేస్తామని ఎంపీడీఓ వెల్లడించారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

ఆమనగల్లు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారం వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరు వెంకటేష్, లాయక్ అలీ, జహంగీర్ అలీ, బోసు రవి, భానురవి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

షాద్‌నగర్: గ్రామీణ రోడ్లఅభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం నుంచి గంట్లవెళ్లి గ్రామం వరకు రూ.8కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా పట్టణాల నుంచి పల్లెలకు రహదారులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవులు, రాములు ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఎంపీ మల్లురవిని నగరంలోని ఆయన నివాసంలో మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ప్రమాద బీమాను వినియోగించుకోండి



నామినీకి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

మంచాల: ప్రమాద బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ రామారావు అన్నారు. మంచాలకు చెందిన పులకంటి మణెమ్మ ప్రమాదవశాత్తు చనిపోయారు. సోమవారం ఆమె నామిని భాస్కర్‌రెడ్డికి బీమా పథకం కింద రూ.20 లక్షలను చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత బీమా స్కీంలను వినియోగించుకోవాలని సూచించారు. అవగాహన లేక పోవడం వలన చాలామంది వాటికి దూరంగా ఉన్నారని తెలిపారు. బీమా పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. నిరుపేద కుటుంబాలకు ఇవి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మంచాల బ్రాంచ్ మేనేజర్ సుధాకర్‌రావు, ఫీల్డ్ ఆఫీసర్ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

మంచాల: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని సీపీఎం మండల నాయకుడు ఆర్.స్వామి అన్నారు. మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన కాట్రోత్ జగ్గునాయక్‌కు రూ.60 వేలు, రామావత్ ధర్మ నాయక్‌కు రూ.20 వేలు, ఎర్ర విక్రమ్‌కు రూ.12 వేలు మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆయన బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పగడాల వెంకటేశ్, బెల్లి పాండు, చంద్రయ్య, కృష్ణ, సోమయ్య, యాదయ్య, ఐలయ్య, హేమ్లా నాయక్, కృష్ణమూర్తి, పాండు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో మాలలకు అన్యాయం



మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాలలు

మాడ్గుల: ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు గోరటి రమేష్ ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం నగరంలో మంత్రి వివేకను.. ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. వర్గీకరణతో జరుగుతున్న అన్యాయంపై చర్చించారు. రోస్టర్ పాయింట్ 22 ఇవ్వడం.. మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లనుందని, రోస్టర్ 16 ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల కళాకారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి

తుర్కయంజాల్: కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకముందే బి- కేటగిరి సీట్లు అమ్ముకుంటున్న గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం కళాశాల ఎదుట ధర్నా చేయనున్నామని పేర్కొన్నారు. ప్రైవేటు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలను కేంద్రంగా చేసుకుని, మేనేజ్‌మెంట్ సీట్లను డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిబంధనలను ఉల్లంఘిస్తున్న కళాశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ జేఏసీ డివిజన్ కన్వీనర్ గుండ్రపల్లి అమరేందర్, మండల కన్వీనర్ సీహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపుగా 26 వేలకుపైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. అందులో 60 శాతం వరకు విద్యార్థులు తాము చదువుకుంటున్న పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటున్నారన్నారు. పాఠశాలలకు వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామానికి ఒక బస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఉచితంగా విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లి, మళ్లీ తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

కొత్త ప‘రేషన్’

కొందరికి వచ్చి.. ఇంకొందరికి రాక

- ఆందోళన చెందుతున్న అర్హులు
- కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు
- తహసీల్, కలెక్టరేట్ కార్యాలయాలకు పరుగు



మంచాల: రేషన్ కార్డులు లేక అర్హులు పరేషాన్ అవుతున్నారు. అర్హత ఉండి నిత్యవసరా సరకులు పొందలేక ఆందోళన చెందుతున్నారు. కడు పేదరికంలో ఉన్నా.. పుష్కర కాలంగా లబ్ధిపొందలేక పోతున్నానని ఆవేదనకు గురవుతున్న నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరించింది. కానీ ఏడాదిన్నర గడిచినా చాలా మందికి కార్డు దరికి చేరకపోవడంతో మీసేవా కేంద్రాలు, తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త దరఖాస్తులు

మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 700 రేషన్ కార్డులకు ఒక్క రేషన్ దుకాణం చొప్పున 26 షాపులు ఉన్నాయి. జూన్ 2025 వరకు 13,710 రేషన్ కార్డులు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 1,178 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 626 మందికి కొత్తగా కార్డులు వచ్చాయి. 555 డీఎస్ఓ(జిల్లా పౌరసరఫర కార్యాలయం)లో పెండింగ్‌లో చూపిస్తున్నాయి. మరో 3,904 అడిషనల్ (కొత్తగా కుటుంబ సభ్యుల చేరికలు) వచ్చినవి.

అర్జీదారుల ఆందోళన

ప్రభుత్వం గత నెలలో ఒక్కొక్కరికి ఒకేసారి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు సరిపడా 18 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసింది. దీంతో ఒక్కో కుటుంబంలో ముగ్గురు సభ్యులు ఉన్న కార్డుపై 54 కిలోల బియ్యం అందాయి. దీంతో కొందరు అర్హులు కార్డు రాలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొందరికి వచ్చి, ఇంకొందరికి రాకపోవడంతో తహసీల్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఆన్‌లైన్ చేశామని తెలపడంతో కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. పాత రేషన్ కార్డులో కొత్తగా కుటుంబ సభ్యులు చేరికలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలా మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. అవీ సక్రమంగా రావటం లేదు. తొలగించాల్సిన చోట పేర్లు చేర్చడం, ఎక్కించాల్సిన చోట తొలగించడం జరిగింది. ఇలా కావడంతో రెండు, రెండు దఫాలుగా పేర్లు మార్పిడి కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది.

త్వరగా ఇవ్వాలి



మా కుటుంబం వేరు పడటంతో పాత రేషన్ కార్డులో ఉన్న పేర్లు తొలగించాం. కొత్తగా కార్డుకు దరఖాస్తు చేసుకున్నాం. ఎదురు చూస్తున్నాం. కానీ రావటం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది. రేషన్ లబ్ధిపొందలేక పోతున్నాం. తక్షణమే కొత్తగా కార్డులు ఇవ్వాలి.

– ఓరుగంటి అనిల్ కుమార్ గౌడ్, జాపాల

నిరంతర ప్రక్రియ



రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి, తిరిగి జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయానికి పంపిస్తున్నాం. మండల స్థాయిలో ఎక్కడా పెండింగ్‌లో లేవు. చాలా కొత్త కార్డులు వచ్చాయి. అర్హులు ఉంటే అర్జీ చేసుకునే అవకాశం ఇంకా ఉంది.

– అచ్చన రమేష్, ఆర్ఐ, మంచాల